క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇంటి గోడ



గంగరాజుపుట్టులో కూలిన ఇంటి గోడ

హుకుంపేట: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు గ్రామానికి చెందిన పి.రమేష్ అనే వ్యక్తి ఇంటి గోడ గురువారం సాయంత్రం కూలింది. దీంతో ఇంటి లోపలి భాగంలో ఉన్న వరిధాన్యం, సామగ్రి తడిచింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రమేష్ కోరారు.

గ్యాస్ ఏజెన్సీల్లో తనిఖీలు



కించుమండ గ్యాస్ ఏజెన్సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ త్రివేణి

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ, డుంబ్రిగుడలో ప్రాంతాల్లోని గ్యాస్ ఏజెన్సీలతో పాటు అరకు, కించుమండ డీఆర్ డీపోలను డుంబ్రిగుడ తహసీల్దార్ త్రివేణి శుక్రవారం తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క సిలండర్ ప్రభుత్వ ధర రూ.877 కాబట్టి ప్రజలు, వినియోగదారుల వద్ద అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఖచ్చితమైన బరువుతో కూడిన సిలిండర్‌లను వినియోగదారులతో పాటు హాస్టల్స్‌కు పంపి ణీ చేయాలని ఆదేశించారు. డీఆర్ డీపోల ద్వారా ప్రజలకు అందజేస్తున్న రేషన్‌లో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు. రికార్డుల నిర్వహణ, స్టాకు తేడాలున్నట్టు గుర్తించారు. ఆమె వెంట డీటీ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని సీపీఎం నాయకులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. స్థానిక డిగ్రీ కళాశాల నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు విద్యార్థులతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు రూ.3వేలు మెస్ బిల్లులు పెంచాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పూర్తిస్థాయి మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు నరేంద్రకు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రభాస్, విద్యార్థులు శ్రావణి, మౌనిక పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి




ఎంపీపీ రమేష్‌బాబు

కొయ్యూరు: నిలిపివేసిన దివ్యాంగు పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై చేస్తున్న చర్యలను తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వం కనీస మానవత్వం చూపకుండా వివిధ కారణాలు చూపించి దివ్యాంగులకు పింఛన్లు నిలిపివేయడం సరికాదన్నారు. కొంత మంది నూరుశాతం వైకల్యం ఉన్న వారికి కూడా ప్రభుత్వం పింఛన్లు నిలిపివేయ డం అమానుషమన్నారు. ప్రభుత్వం వారికి యథావిధిగా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

మృతదేహాల అప్పగింత

జి.మాడుగుల: మండలంలో బొయితిలి గ్రామ సమీపంలో గురువారం కరెంట్ తీగలు తెగిపడి షాక్‌కు గురై అక్కక్కడే ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసులకు శుక్రవారం మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. మండలంలో కోడిమామిడి గ్రామ పరిసర ప్రాంతాల నుంచి ట్రాలీపై కాంక్రీట్ మిల్లర్‌ను ఎక్కించుకొని వెనుకన ద్విచక్ర వాహనంపై వస్తుండగా విద్యుత్ తీగలు తెగిపడి రాజవమ్మంగి మండలం యర్రంపాడు గ్రామానికి చెందిన పూట వెంకటేష్(24), రాజవమ్మంగి మండలం, వట్టిగడ్డ గ్రామానికి చెందిన నల్లబల్ల రాజ్‌కుమార్(24) షాక్‌కు గురై అక్కడక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఇద్దరి మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దారుణ దారులు



ప్రమాదకరంగా తీగలవలస వంతెన

- అధ్వానంగా కామయ్యపేట రోడ్డు
- గోతులదారులు, శిథిలావస్థలో వంతెనలు
- వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కామయ్యపేట రహదారి దుస్థితి

హుకుంపేట: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుకు ప్రధాన రహదారి కామయ్యపేట రోడ్డు గోతులమయంగా మారి ప్రమాదస్థాయికి చేరుకుంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట–కామయ్యపేటకు వెళ్లే దారిలో మట్టుజోరు గ్రామం నుంచి తీగలవలస గ్రామం వరకు సుమారు 5కిలో మీటర్ల మేరా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కనీసం వాహనాలు వెళ్లేందుకు రోడ్డు కష్టంగా మారింది. తీగలవలస,కామయ్యపేట గ్రామల సమీపంలో ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాద స్థాయికి చేరడంతో ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒడిశా సరిహద్దుతో పాటు పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరుకు మండలాలకు వెళ్లేందుకు ఈ దారి దగ్గర కావడంతో చాలా మంది ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా ఒడిశా ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు బల్దా కేవ్స్, మాచ్‌ఖండ్ రిజర్వాయర్, దుదుమ జలపాతం, జోలాపుట్, ప్రాంతాలకు కూడా ఈ మార్గం మీదుగా ప్రయాణిస్తారు. అందుకు నిత్యం ఈ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంత రద్దీగా ఉండే ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

తరచూ రిపేర్లు

ఆటో నడుపుతూ కుటుంబానికి పోషిస్తున్నాం. రోడ్డు అధ్వానంగా మారడంతో నిత్యం రిపేర్‌లు అవుతున్నాయి. ఆటో మరమ్మతులకే డబ్బులు దార బోస్తున్నాం. దీంతో పోషణకు కష్టతరంగా మారింది. కామయ్యపేట రహదారి అధ్వానంగా ఉండడంతో ఆటోలు నడపాలంటే ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలి.

– పాంగి ప్రసాద్, కామయ్యపేట

పెరుగుతున్న ప్రమాదాలు

రోడ్డు అధ్వానంగా మారడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందిగా ఉంది. గోతుల రహదారులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు కురిసినపుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. గోతుల్లో నీరు చేరడంతో గమనించలేని వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాలి.

– పాంగి అర్జున్, గుర్రాలతోట

అధికారులు స్పందించాలి

కామయ్యపేట రోడ్డు అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో వంతెనలు ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. దీంతో మూడు పంచాయతీల ప్రజలతో పాటు ఒడిశా నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి, రోడ్డు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– కిల్లో ఆనంద్, వైస్ సర్పంచ్, తీగలవలస పంచాయతీ

అరకు ఎమ్మెల్యేను కలిసిన రేంజర్



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేంజర్ కోటేశ్వరరావు

అరకులోయటౌన్: అరకులోయ రేంజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రేంజర్ కోటేశ్వరరావు శుక్రవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖపట్నం అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇటీవల అరకు రేంజర్‌గా కోటేశ్వరరావు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అరకు ప్రాంతంలో గిరిజనులకు అటవీ శాఖ నుంచి మంచి సేవలందించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అటవీశాఖ సిబ్బంది అప్పన్న, ఉద్దంగి తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ధర్మన్నపడాల్

జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి గ్రామానికి చెందిన పలాసి సోమేష్ గోతిలో పడి మృతి చెందడానికి నేషనల్ హైవే 516ఈ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ అన్నారు. హైవే రోడ్డు నిర్మాణ పను ల్లో తీవ్ర జాప్యం, నిర్మాణల్లో భాగంగా కె.కోడాపల్లి పలు చోట్ల ప్రమాదకర గోతులు తవ్వి వదిలి పెట్టారని, దీంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైవే రోడ్డు నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం, అధికార్లు పర్యవేక్షణ లోపం వలన ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. అమాయక గిరిజనుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. కె.కోడాపల్లి గ్రామంలో కల్వర్టు గోతిలో పడి మృతి చెందిన సోమేష్ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించాలని, మరణానికి కారణమైన కాంట్రాక్టర్, అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. హైవే రోడ్డు పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వటానికి అధికారులు దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



ఊబలగరువులో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, నాయకులు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీలో ఊబలుగరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, పార్టీ శ్రేణులు కలసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అధికారంలోని వచ్చాక రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలు గురించి కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మత్స్యకొండంనాయుడు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో యువతకు 20లక్షలు ఉద్యోగాలు, నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి వంటి హామీలు గాలిలో కలసిపోయాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పథకాలు అమల్లో కోతలతో అర్హులైన ప్రజలకు రైతులకు దివ్యాంగులకు, వృతిదారులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. నాయకులు గంగరాజు, చిట్టిబాబు, సీతారాంనాయుడు, రామకృష్ణ, ఉత్తరవేణు, వలసయ్య, బంగారాజు తదితరలు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి

సీలేరు: ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఐ.జీ.పి. రవికృష్ణ ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ సూర్యమోహన్‌రావు, నారాయణరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్ జోలికి వెళ్లొద్దన్నారు. బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జెన్‌కో ఈఈ రాజేంద్ర ప్రసాద్, రేంజర్ వెంకటరావు, ఏఈఈ సురేష్, జెన్‌కో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్

చింతూరు: వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయిన అన్ని గ్రామాల ప్రజలకు తక్షణమే నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. చింతూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదలతో గత ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోయి నాలుగు మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యావసర సరకులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరద పూర్తిగా తగ్గనందున అవసరమైన ప్రాంతాల్లో బోట్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శబరి పరివాహక ప్రాంతాల గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయ కలుగుతోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.నాయకులు వెంకట్, సురేష్, లక్ష్మణ్, నాగేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అరకులోయటౌన్: ఎండపల్లివలసలో క్రైస్తవ పరిచర్య సేవ చేస్తున్న యేసుపాదంపై ఇటీవల కొంత మంది దుండగులు చేసిన దాడిని అరకులోయ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ఖండించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు బి.ఈ.సంజీవ్‌కుమార్, కె.ఎస్.బాబూరావు, ప్రసాద్‌పాల్, జాన్, షడ్రక్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

కొయ్యూరు: మహిళలు ఆత్మరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పాడేరు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. బాలికలు మరింత జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం మహిళల ఆత్మరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై పెరుగుతున్న హింసను ఎదుర్కోవడంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వేధింపులకు గురిచేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. నిరంతరం అప్రమత్తతో ఉండాలన్నారు. సీఐ వెంకటరమణ, కొయ్యూరు, మంప ఎస్ఐలు కిషోర్ వర్మ, శంకర్ రావు, కేజీబీవీ ఎస్‌వో పరిమళ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం జిల్లా ఏర్పాటుకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి నరేష్

చింతూరు: పోలవరం ముంపు మండలాలను కలిపి రంపచోడవరం జిల్లాగా ఏర్పాటు చేయాలని తద్వారా ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అల్లూరి జిల్లాలో కొనసాగుతున్న రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం ముంపు మండలాలతో కలిపి కారం తమ్మన్నదొర జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపవద్దని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సీతారామయ్య, శ్రీను, రవికుమార్, రఘు, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు టీబీపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ ఆదిత్య

అరకులోయటౌన్: టీబీ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అరకులోయ ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ ఆదిత్య అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆదిత్య పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అరకులోయ ఏరియా ఆస్పత్రిలో టీబీకి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కావున విద్యార్థులు తమ గ్రామాల్లో టీబీతో బాధపడుతున్న వారు ఉన్నట్లయితే ఆస్పత్రికి తీసుకువచ్చి టీబీ పరీక్షలు చేయించాలన్నారు. ఆస్పత్రి టీబీ వ్యాధికి సంబంధించిన ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ టీబీ వ్యాధికి సంభందించి, ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలు, మందులు గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి మాట్లాడుతూ విద్యార్థులందరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, అప్పారావు, సోంబాబు, లచ్చన్న, సురేష్, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మిరేఖల రిజర్వాయర్ పరిశీలన



అమ్మిరేఖలలోని రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ ఏఈ హరి తదితరులు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం అమ్మిరేఖల గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని రిజర్వాయర్‌ను మైనర్ ఇరిగేషన్ ఏఈ హరి తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఈ రిజర్వాయర్‌కు గల రెండు మదుములు, వాటికి గల రెండు షట్టర్లు (తలుపులు) పూర్తిగా దెబ్బతినడంతో సాగునీరు దిగువకు వృథాగా పోతోందని ఇటీవల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించి పరిస్థితిని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏఈ హరి మాట్లాడుతు ఈ రిజర్వాయర్ చెరువు గర్భం 40 ఎకరాలుగా చెప్పారు. అలాగే ఈ రిజర్వాయర్ కు గల రెండు పంటకాలువల ద్వారా అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి గ్రామాల్లోని సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. అయితే రెండు షట్టర్లు తుప్పుపట్టి పాడవడంతో నీరు దిగువకు వృథాగా పోతున్నట్టు గుర్తించామన్నారు. షట్టర్ల రిపేరుకు సుమారు రూ. 3 లక్షలు ఖర్చు అవుతుందని, ఎస్టిమేషన్ రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఈ రిజర్వాయర్ గర్భం పూర్తిగా పూడికతో ఉందని,, పూడికతీత పనులు కూడా చేపట్టాలని స్థానిక కోరుతున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



శాకాంబరి అలంకరణలో మారెమ్మ తల్లి



పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: శ్రావణ మాసం ఐదవ శుక్రవారం సందర్భంగా సీలేరులోని మారెమ్మ తల్లి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారు శాకంబరీ దేవిగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు దామోదరం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉచితంగా పూజాసామగ్రిని అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



హాజరైన మండలస్థాయి ట్రైనర్లు

రంపచోడవరం: కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో అమలు చేయనున్న ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరం వైటీసీలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రెనర్లు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఆయా ట్రైనర్లు వారు మండలస్థాయిలో మూడు రోజుల పాటు ఆది కర్మ యోగి అభియాన్ శిక్షణ ఇస్తారన్నారు. మండలస్థాయి ట్రైనర్లు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై గిరిజనుల సహకారంతో విలేజ్ విజన్ మ్యాప్ తయారు చేసి సమర్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మారేడుమిల్లి ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం గురించి వివరించారు. డీడీ షరీఫ్, డీడీవో కె.కోటేశ్వరరావు, ఎంపీడీవోలు కె.ఆర్.విజయ, బాపన్నదొర, సాల్మన్‌రాజు, యాదగిరిరేశ్వరరావు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రెనర్‌లు శారదదేవి, చంద్రకిరణ్, శిరీష, రామం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సరకుల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎంపీపీ పాయం రంగమ్మ

కూనవరం: వరద బాధితులు నిత్యావసర వస్తువులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ అన్నారు. కొండ్రాజుపేట పంచాయతీ పరిధిలోని శబరి కొత్తగూడెం వరద బాధితులకు శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి వరదలకు 80 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి కందిపప్పు, నూనె ప్యాకెట్, బంగాళ దుంపలు, ఉల్లిపాయల చొప్పున పంపిణీ చేశారు. సర్పంచ్ కట్టం లక్ష్మి, పీసా కమిటీ చైర్మన్ కుంజా శ్రీను, కమిటీ సభ్యులు, కార్యదర్శి జాహ్నవి, వీఆర్‌వో విజయ కుమారి గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



అరకులోయ సీఐ హిమగిరి



జీకే వీధి సీఐ వరప్రసాద్



చింతపల్లి సీఐ వినోద్‌బాబు



ఎటపాక సీఐ కన్నపరాజు



సీలేరు ఎస్ఐ రవీంద్ర

అరకులోయటౌన్/గూడెంకొత్తవీధి/ఎటపాక/చింతపల్లి/ సీలేరు: అల్లూరి జిల్లా వినాయకచవితి వేడకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసుశాఖ పలు సూచనలు చేస్తోంది. ఇందులో భాగంగా వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా అరకులోయ సీఐ, గూడెం కొత్తవీధి, ఎటపాక, చింతపల్లి సీఐలు ఎల్.హిమగిరి, వరప్రసాద్, కన్నపరాజు, సీలేరు ఎస్ఐ రవీంద్రనాథ్ విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు వారు తమ పూర్తి చిరునామ, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యుల వివరాలు, సెల్ ఫోన్ నెంబర్లు, నిమజ్జనం తేది తదితర వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పోలీసులు ఆయా ప్రాంతాన్ని సందర్శించి, క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో ఎన్‌ఓసి డౌన్‌లోడ్ చేసుకోని మండపాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రోడ్డు మధ్యలో మండపాలు ఏర్పాటు చేయవద్దని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, సీసీ కెమెరాలు మండపాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని, వాహనచోదకులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ఉత్సవాలకు కమిటీలే పూర్తి బాధ్యత వహించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని సాధారణ సౌండ్ బాక్సులు మాత్రమే ఏర్పాటుచేయాలని, మైక్‌లకు ఏఎస్పీ నుంచి అనుమతి, మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి అని చెప్పారు. రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు చేయకూడదని, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు.తొక్కిసలాట, అగ్నిప్రమాదాలు, కరెంట్‌షాక్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. నిమజ్జనంలో మద్యం సేవించడం, వాహనాలపై చిన్నపిల్లలను ఎక్కించడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.